





అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 10 ఏప్రిల్ 2023 పేజీలు : 04


# రాప్తాడు నియోజకవర్గంలో వైసిపి, బిజెపికి షాక్

- రెండు పార్టీల నాయకులు టిడిపిలోకి చేరిక
- అన్ని పార్టీలు టిడిపి వైపు చూస్తున్నాయి
- చాలా మంది ప్రజాప్రతినిధులు మాతో టచ్‌లో ఉన్నారు
- మాజీ మంత్రి పరిటాల సునీత సంచలన వ్యాఖ్యలు



టిడిపిలో చేరిన వారితో మాజీ మంత్రి పరిటాల సునీత

**అనంతపురం కలెక్టరేట్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గంలో వైసిపికి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చాలా మంది తమతో టచ్‌లో వున్నారని, టిడిపిలో చేరేందుకు వారు సిద్ధంగా వున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత సంచలన వ్యాఖ్యలు చేశారు. రాప్తాడు నియోజకవర్గంలోని రాపా_ _డు, అనంతపురం రూరల్‌కు చెందిన బిజెపి, వైసిపి నాయకులు ఆదివారం పరిటాల సునీత స్వగృహంలో తెలుగుదేశంపార్టీలో చేరారు. బిజెపి రాప్తాడు మండల కన్వీనర్ ధనుంజయ ఆధ్వర్యంలో 150 మంది ప్రసన్నాయపల్లి, కక్కలపల్లి, పాలచర్ల, పిల్లిగుండ్లకాలనీకి చెందిన నాయకులు పార్టీలో చేరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుతో విసిగిపోయి తాము టిడిపిలో చేరినట్లు వారు తెలిపారు. తెలుగుదేశం పార్టీతోనే ప్రస్తుతం అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలుగుదేశంపార్టీలో చేరినట్లు తెలిపారు. మాజీ మంత్రి పరిటాల సునీత వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తగా పార్టీలోకి వచ్చామన్న భావన లేకుండా అందరితో కలిసిపోయి పనిచేయాలని, మీకు భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని పరిటాల సునీత వారికి హామి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తీరువల్ల అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే ఇతర పార్టీల నాయకులంతా టిడిపి వైపు చూస్తున్నారన్నారు. చాలా మంది సర్పంచులు, ఎంపిటిసిలు తమకు నిత్యం ఫోన్ చేస్తున్నారని ఎప్పుడు పార్టీలో చేరాలని అడుగుతున్నారని సునీత అన్నారు. జిల్లాలో 12 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపిలు, మంత్రులు వున్నా ఏరోజైనా రైతుల సమస్య గురించి మాట్లాడారా అని నిలదీశారు. తాము ఏమైనా అంటే అడ్డదిడ్డంగా మాట్లాడడం తప్ప వారు చేసేది ఏమిలేదని ఎద్దేవా చేశారు. నారా లోకేష్ పాదయాత్రకు రాప్తాడు నియోజవర్గంలో మంచి స ్పందన వచ్చిందని అన్ని వర్గాల వారు పాదయాత్రలో పాల్గొన్నారన్నారు. వారందరికి పరిటాల సునీత కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు వస్తేనే తమ పిల్లల భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందన్న భావనలో ప్రస్తుతం ప్రజలు వున్నారని ఆయన పాలన కోసం అంతా ఎదురుచూస్తున్నారని ఆమె స్పష్టం చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

# సవాళ్లు..ప్రతి సవాళ్ల మధ్య లోకేష్ పర్యటన..!

*- లోకేష్ నిరాధార ఆరోపణలు చేస్తే నిలదీస్తామన్న పెద్దారెడ్డి - దమ్ముంటే రావాలని ప్రతి సవాలు విసిరిన జేసీపీఆర్*



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సవాల్ విసురుతున్న మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రి, ఏప్రెల్ 9, ప్రభాతవార్త**

తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హెచ్చరికలు, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రతి సవాళ్లతో లోకేష్ పర్యటన ఉచ్చుకతగా మారింది. అనంతపురం జిల్లాలో లోకేష్ తన పాదయాత్ర సందర్భంగా కొందరు ఎమ్మెల్యేలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, అలా తనపై నిరాధార ఆరోపణలు చేస్తే వెంటనే లోకేష్ పాదయాత్ర వద్దకు వచ్చి నిలదీస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పత్రికా విలేకరుల సమావేశంలో ఆదివారం హెచ్చరించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. యువగళం పేరుతో లోకేష్ ఏ ఉద్దేశంతో పాదయాత్ర చేస్తున్నాడో ప్రజలకు అర్థం కావడం లేదని, జిల్లాలోని ప్రతి నియోజక వర్గంలో మా పార్టీ ఎమ్మెల్యేలపై ఆయా నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జిలు రాసిచ్చిన అంశాలను మాత్రమే చదువుతూ తన సొంత ఆలోచనలేని విధానాన్ని బయటపెట్టుకుంటున్నారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. తమపై చేసిన ఆరోపణలకు మా పార్టీ ఎమ్మెల్యేలు మీడియా సమావేశాలు పెట్టి ఖండించాల్సి వస్తోందని, తన పద్ధతి అలా ఉండదని ఆయన అన్నారు. జేసీ సోదరులు కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు తెదేపా నాయకులు, కార్యకర్తలపై తీవ్రమైన దాడులు చేస్తే తాము అండగా ఉంటామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు జేసే సోదరులనే కౌగిలించుకొని, పక్కన పెట్టుకొని తిరుగుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. జేసీ సోదరుల నుంచి తమకు జరిగిన అన్యాయాన్ని పరిటాల కుటుంబం మరచిపోయి సిగ్గువిడిచి వారితో తిరగొచ్చేమో గాని, తాడిపత్రి నియోజకవర్గంలోని చాలా మంది తెదేపా నాయకులు, కార్యకర్తలు జేసీ సోదరులకు దూరంగా ఉంటూ వైకాపా వైపు మొగ్గు చూపడం వారి ఆత్మగౌరవానికి నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. తాడిపత్రిలోని అప్పటి తెదేపా నాయకుడు మురళీ ప్రసాద్‌రెడ్డి ఇంటిని తగలపెట్టి ధ్వంసం చేసినప్పుడు మంత్రిగా ఉన్న పరిటార సునీత మాట్లాడుతూ జేసీ దివాకర్‌రెడ్డితో తన కుటుంబం కూడా నష్టపోయిందని, వారిని తెదేపాలోకి పిలుచుకొనే ప్రసక్తే లేదని చెప్పి ఇప్పుడు వారితో చెట్టా పట్టాలు వేసుకొని తిరగడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పెద్దారెడ్డి పేర్కొన్నారు. పెనుగొండలో పాదయాత్ర సాగుతుండగా జేసీ ప్రభాకర్‌రెడ్డిని చూసి లోకేష్ ఏం హీరో..నిన్ను చూసే ఇంప్రెస్ అయ్యానంటూ మాట్లాడం సిగ్గుచేటని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. కేసులు ఎక్కువగా ఉంటేనే తమ పార్టీలో చక్కటి గుర్తింపు ఉంటుందని లోకేష్ తన పార్టీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సమంజసం కాదని ఆయన అన్నారు. త్రిశూల్ సిమెంట్స్ పేరుతో కోనుప్పలపాడులో సాగుతున్నది అక్రమ మైనింగేనని తెదేపా అగ్రనాయకులు పయ్యావుల కేశవ్, పార్థసారథి, కాల్వ శ్రీనివాసులుతో పాటు సీపీఐ, సీపీఎం నాయకులు మాట్లాడటం జరిగిందని, అలాంటి జేసీ సోదరులను పార్టీలోకి చేర్చుకొని తెదేపాకు మద్దతుగా నిలిచిన వారికి అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. స్థానిక నాయకులిచ్చిన కాగితపు ముక్కలను చూసి నాపై నిరాధార ఆరోపణలు చేస్తే మరుసటిరోజు నీవక్కడ ఉంటే అక్కడికి వచ్చి నిలదీస్తానని లోకేష్‌కు ఎమ్మెల్యే సవాలు విసిరారు.

### దమ్ముంటే అడ్డుకో..!

నీకు దమ్ముంటే లోకేష్ పాదయాత్రను అడ్డుకో అని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సవాలు విసిరారు. నీకు పోలీసులు ఉన్నారనే నన్ను ఆలూరు కోనకు రాకుండా అడ్డుకున్నావని, రేపు సంవత్సరం ఆలూరు కోనకు బురఖా వేసుకొని రావాల్సి ఉంటుందని జేసీ ఎద్దేవా చేశారు. నిన్ను కొజ్జాలతో పోలిస్తే వారు కూడా సిగ్గుపడటతారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దమ్ముంటే లోకేష్ దగ్గరకు రావాలంటూ మీసం మెలేసి సవాలు విసిరారు. కంకర, ఇసుక, మట్టి అన్నీ ఎమ్మెల్యేనే తోలుకుంటుంటే పోలీసులు వత్తాసు పలుకుతున్నారని, ఈ నెల 14 నుంచి పరిస్థితి తీవ్రంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే హెచ్చరించారు.

ఇలా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల సవాలు, ప్రతి సవాళ్లతో లోకేష్ పర్యటన ఉద్రిక్తతను పెంచుతోంది. ఇద్దరూ ఈ పర్యటన పర్యవసానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రాయలచెరువు బహిరంగ సభే సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# అవినీతి చేసినట్లు నిరూపించండి

**- ఒక్క సెంటు భూమి నేను ఆక్రమించుకున్నట్లు చూపిస్తే.. మీకే రాసిస్తా..**

**నారా లోకేష్‌పై ఓపెన్ ఛాలెంజ్ విసిరిన రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి**



పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

**శింగనమల, ఏప్రిల్ 9 ప్రభాతవార్త**

నేను, మా కుటుంబం అవినీతి, అక్రమాలు చేసినట్లు ధైర్యముంటే నిరూపించండి, ఒక్క సెంటు భూమి ఆక్రమించినట్లు చూపిస్తే.. మీకే రాసిస్తా.. టీడీపీ యువనేతనారా లోకేస్‌పై రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి ఓపెన్ ఛాలెంజ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నారా లోకేష్ పాదయాత్రలో భాగంగా శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలంలో నిర్వహించిన యువగళం పాదయాత్రలో మాట్లాడుతూ.. శింగనమలకు ఆరు మంది ఎమ్మెల్యేలు ఉన్నారని చెబుతున్నారు. బహుష నియోజకవర్గానికి ఒక్క ఎమ్మెల్యే ఉంటారని లోకేష్ తెలియకపోవచ్చు. మండలానికి ఒక్క ఎమ్మెల్యే మండలానికి ఒక్క ఎమ్మెల్యే ఉంటారని నారా లోకేష్ అనుకుంటున్నాడు. లోకేష్ ఎప్పుడూ ఎమ్మెల్యే కాలేదు. తన తండ్రి బిక్షతో శాసనమండలికి వెళ్లి మంత్రి అయ్యాడన్నారు. నా సతీమణి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నాకన్నా విద్యా వంతురాలు, ఆమెకు నేను, మరొకరు సలహాలు ఇవ్వాల్సిన పనిలేదు. ఆమెకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. ఆమె కుటుంబ సభ్యుల్లో 20 మంది సివిల్ సర్వీసుల్లో ఉన్నారు. నేను రాజకీయాల్లోకి రాకముందే 2007లోనే నాకు విద్యా సంస్థలు ఉన్నాయి. నేను కోట్ల రూపాయలు సంపాదించలేదు, అంతకు మించి ప్రజాభిమానం సంపాదించాను, మీ పర్యటనలో ఒక టిడిపి ఇన్‌చార్జ్ దళిత నేతపై దాడులు జరుగుతుంటే స్పందించలేని నాయకుడు నువ్వు అన్నారు. ఎస్సీ నియోజకవర్గంలో ఇద్దరు అగ్రవర్ణాల నేతలకు పెత్తనం ఇచ్చారు. ముందు లోకేష్ వాటిని గురించి ఆలోచించు అని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

# అధికారంతో పరిటాల కుటుంబం అభివృద్ధి చెందింది



మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**- నియోజకవర్గం ఏ మాత్రం అభివృద్ధి చెందలేదు**
**- దారిన పోయే దానయ్య లోకేష్ వచ్చి నాలుగు మాటలు మాట్లాడినంత మాత్రాన అపద్దాలు నిజాలు కావు**
**- 20 ఎకరాల నుంచి వేల ఎకరాలకు పరిటాల కుటుంబం ఎదిగింది**
**- వారి హయాంలో రైతులు కూలీలయ్యారు.. కూలీలు వలస వెళ్లారు**
**- ఈ రోజు పేరూరు డ్యాంలో నీళ్లు ఉండడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు**
**- నియోజక వర్గంలో కమ్మ కులస్తులను ఎక్కడైనా ఇబ్బంది పెట్టామా..?**
**- నా కట్టె కాలేంత వరకు నిజాయితీగానే బతుకుతా..**
**- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి**
**- రామగిరి, కనగానపల్లి మండలాల ఆసరా కార్యక్రమం ప్రారంభం**

**రామగిరి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త**

అధికారం ఉన్నంతకాలమూ పరిటాల కుటుంబం అభివృద్ధి చెందింది తప్పా నియోజకవర్గం అభివృద్ధి కాలేదని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం రామగిరి, కనగానపల్లి మండలాల ఆసరా కార్యక్రమం పేరూరులో జరిగింది. ఎమ్మెల్యేతోపాటు ఎంపి గోరంట్ల మాధవ్, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిటాల కుటుంబం 20 ఎకరాల నుంచి వేల ఎకరాలకు ఎదిగారు. ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి. వారు అభివృద్ధి చెందారు తప్ప నియోజకవర్గం అభివృద్ధి చెందలేదన్నారు. మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించి 26వేల ఓట్లు మెజార్టీతో గెలిపించారు. మీ రుణం తీర్చుకునేందుకు గత నాలుగేళ్లుగా ప్రతి నిమిషం కష్టపడుతున్నా మీ అందరి ఆశీర్వాదం, భగవంతుడి దయ వల్ల అనేక కార్యక్రమాలు తీసుకొచ్చామన్నారు. పరిటాల కుటుంబం అధికారంలో ఉన్న 25 ఏళ్లు రాప్తాడు, పెనుకొండ నియోజకవర్గాల్లో అనేక దౌర్జన్యాలు, ఎన్నో హత్యలు, దోపిడీలు, మానభంగాలు జరిగాయి. నేను ఎమ్మెల్యే అయిన నాలుగేళ్లలో జగనన్న ఆశీర్వాదంతో ఎక్కడా దౌర్జన్యం, దుర్మార్గం, దోపిడి, అరాచకాలు లేకుండా శాంతి భద్రలను నిర్వహించగలిగామన్నారు. గత ప్రభుత్వంలో అనేక హామీలు ఇచ్చి చంద్రబాబు మోసం చేశారన్నారు. పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులను గెలుసుకుని తీసుకొచ్చిన మేనిఫెస్టోలో అన్ని హామీలను జగనన్న అమలు చేశారన్నారు. కష్టపడిన వ్యక్తికి కష్టం విలువ తెలుసన్నారు. చంద్రబాబు ఏది నోటికి వస్తే అది హామీ ఇచ్చి ఏ ఒక్కటీ చేయలేదన్నారు. ప్రజలను మోసం చేశామనే సిగ్గుతో మేనిఫెస్టోను కూడా వెబ్‌సైట్ నుంచి తొలగించారన్నారు. మాజీ మంత్రి పరిటాల సునీత స్వయంగా అసెంబ్లీలోనే డ్వాక్రా రుణాలు మాఫీ చేయలేదని, చేసే ఆలోచన కూడా లేదని చెప్పారు. ఎన్నికల ముందు మాత్రం డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామన్నారు. బంగారు రుణాలు మాఫీ చేస్తామన్నారు. రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పారన్నారు. దివంగత ఎన్టీఆర్ నుంచి పార్టీని లాక్కున్న చంద్రబాబు వ్యాపార సంస్థగా మార్చేశారన్నారు. గత ప్రభుత్వంలో పరిటాల సునీత మంత్రిగా ఉన్నప్పుడు కానీ, పరిటాల రవీంద్ర మంత్రిగా ఉన్నప్పుడు కానీ నియోజకవర్గానికి తాగునీటి పథకం తీసుకొద్దామని ఆలోచించలేదన్నారు. ఈ రోజు జగనన్న ఆశీస్సులతో కేంద్ర ప్రభుత్వ నిధులతో జల జీవన్‌మిషన్ ద్వారా రూ.110 కోట్లతో ఆరు మండలాల్లోనూ ప్రతి ఇంటికి తాగునీరు అందించే పథకాన్ని మంజూరు చేయించామన్నారు. పరిటాల సునీత మంత్రిగా ఉండి 1200 ఇళ్లు తీసుకొస్తే నేను 25వేల ఇళ్లు మంజూరు చేయించానన్నారు. పరిటాల రవీంద్ర హయాంలో రామగిరి గనులు మూతపడ్డాయని, ఈ రోజు వాటిని తెరిపించేందుకు చర్యలు తీసుకుంటున్నానన్నారు. దోపిడి దారులు వాళ్లా.. నేనా మీరే చెప్పండి.. మా కుటుంబం అద్దె ఇంట్లో ఉంటున్నా కానీ పేదలకు సొంతిళ్లు కల నెరవేర్చు తున్నామన్నారు. మా వ్యసాయంలో నేను బోరు వేయించుకోలేదు కానీ పేద రైతులకు నా సొంత డబ్బుతో ఉచితంగా బోర్లు వేయిస్తున్నానన్నారు. లోకి ఈ ప్రాంతానికి వచ్చిలొల్లి చేసుత్నఆ్నడు. లోకీ అదో పిల్లకాకి, పెద్దగా మాట్లాడుకోవాల్సిన పనిలేదు. ఆ రోజు మంత్రిగా ఉంఇ కూడా చేతకాలేదు. లోకీ నువ్వు మొగోడివైతే ఆ భూములు మీ వద్దే ఉన్నాయి. ఈ రోజైనా ఆ జాకీ కంపెనీ తీసుకురా, ఆ రోజు నువ్వు పరిశ్రమల మంత్రిగా ఉన్నావు, ఇక్కడ మహానటి మంత్రిగా ఉంది, నీ తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నారు. మీరు 2015లో అనుమతులు ఇచ్చి జాకీ కంపెనీ ఎందుకు ఏర్పాటు కాలేదు. రూ.150 కోట్ల విలువైన భూములను కేవలం 3 కోట్లకే అప్పగించి, మూడేళ్లలో ఆ భూములు అమ్ముకునేలా జీవో ఇచ్చిన మీరు దొంగలా.. మేము దొంగలా..? లోకేష్.. నువ్వుజిల్లా దాటిపోయేలోపు ఓ ప్రకటన చేయి, జాకీకి కేటాయించిన 25 ఎకరాల భూమిని మాకు అప్పగించమని చెప్పు, 6వేల మంది అక్క చెల్లెమ్మలకు ఉపాధి కల్పించే పరిశ్రమ ఏర్పాటు చేసి చూపిస్తా.. నువ్వు నిజాయితీ పరుడైతే పరిశ్రమను తీసుకురా.. ఈ కార్యక్రమంలో మహిళలు మండల కన్వీనర్లు, ఎంపిపిలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, చైర్మన్లు, డైరెక్టర్లు, స్టోర్ డీలర్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





మహిళలకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

# మరణం తర్వాత కూడా జీవించి ఉన్న వ్యక్తి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్

**- ఘనంగా నివాళులు అర్పించిన అవే సంస్థ అధ్యక్షులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి**

**- ఆర్డిటి సంస్థ ప్రతినిధి విశాల ఫెర్రర్, డైరెక్టర్ తిప్పేస్వామి**



నివాళులు అర్పిస్తున్న ప్రభాకర్ చౌదరి, ఆర్డిటిసి ప్రతినిధులు, తదితరులు

**అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త**

మరణం తర్వాత కూడా జీవించి ఉన్న వ్యక్తి పాదర్ విన్సెంట్‌ఫెర్రర్ అని అవే సంస్థ అద్యక్షులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. ఆదివారం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 103వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి సంస్థ త్రినిధులు విశాల ఫెర్రర్, డైరెక్టర్ తిప్పేస్వామిలు సైతం పాల్గొన్నారు. అనంతరం ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ.. జిల్లాలో ఆయన కృషికి కృతజ్ఞతగా అవే సంస్థ ఆధ్వర ్యంలో స్వచ్ఛందంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఆయన కృషికి కృతజ్ఞతగా అవే సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా ఆయన విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. విదేశాల నుంచి వచ్చే వ్యక్తులు కూడా ప్రేరణతో తోడ్పాటు అందించడానికి ఈ విగ్రహం తోడ్పడుతుందన్నారు. అనేక దశాబ్దాల కిందట జిల్లాకు వచ్చి ఇక్కడ ఆర్థిక స్థితిగతులను, పేదరికం చూసి చలించిపోయి, తనకున్న ఆశయాల మేరకు సేవా భావంతో ఈ జిల్లాలో అణగారిన వర్గాల కోసం, అనావృష్టి జిల్లాలో నిరంతరం శ్రమించి, ప్రభుత్వానికి సమాంతరంగా వ్యవస్థను ఏర్పరిచి విద్య, వైద్య, ఆరోగ్యమే కాకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి ఈ జిల్లా ప్రజలకు నిరంతరం సేవలందించిన మహోన్నత వ్యక్తి మానవతా వాది విన్సెంట్ ఫెర్రర్ అన్నారు.

### సేవలు మరింత విస్తృత పరుస్తాం : విశాల ఫెర్రర్

ఆర్డిటి సేవలు మరింత విస్తృత పరుస్తామని ఆర్డిటి ప్రతినిధి విశాల ఫెర్రర్ పేర్కొన్నారు. ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతూ.. స్పందించు సాయం అందించు కార్యక్రమం ద్వారా జిల్లాలో ఎంతో మందికి సేవలందిస్తున్నామని, మరిన్ని సేవలు అందించడానికి ఆర్డిటి సంస్థ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అవే సంస్థ జిల్లా అధ్యక్షులు బంగినాగ, కెపి నారాయణస్వామి, బిఎస్‌దాస్, జల్లా తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధులు సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీ, రాష్ట్ర యాదవ కురువ కోఆర్డినేటర్ శివబాల, రాష్ట్ర గాండ్ల సాధికార అధ్యక్షురాలు, విశాలాక్ష్మి, మాజీ కార్పోరేటర్ రాధదేవి, ఉమామహేష్, జిల్లా మహిళా అధికార ప్రతినిధి వసుంధర, రాష్ట్ర నాయకులు కూచిహరి, ముక్తియార్, గోపాల్ గౌడ్, పూలబాషా, డైమండ్ రఫి, శిరీశాల రాంబాబు, సున్నం శ్రీనివాసులు, వడ్డే మురళీ, కుల సంఘాల నాయకులు ఎల్లన్న, సాకే హరి, తిరుపాలు, చిన్న ఆంజినేయులు, మండల రమేష్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

